

వీరికి ఆంధ్ర భాషయే కాకఆంగ్ల రచనలు వ్యాకరణాది లక్షణారూఢములై శుద్ధ సుందరముగా నుండుట హర్షదాయకము.

# ఉదగ్ర గ్రాంథికవాది


**సాహిత్య విద్యాప్రవీణ**

**డాక్టర్ మునుగంటి కృపాచార్యులు, ఎం.ఏ., పి.హెచ్‌డి.**


ఆంధ్రదేశమునందు శ్రీ ఎలవర్తి రోశయ్యగారిని గూర్చి యెఱుంగని ఆంధ్రపండితులుగాని ఆంగ్ల పండితులుగాని లేరని చెప్పవచ్చును. వీరు ఆంగ్లము ప్రధానముగా గుంటూరు క్రిస్టియన్ కాలేజిలో, తదుపరి మద్రాసు ప్రెసిడెన్సికాలేజిలో జదివి బి.ఏ., ఎం.ఏ., పట్టములు గణ్యశ్రేణిలో పొందినప్పటికి, ఆంధ్ర భాషయందు గూడ నిర్ణిద్రాభిమాన ప్రేరితులై స్వయం కృషితో అట్టి పట్టముల నందుకొన జాలిన పాండిత్యమును గడించినారు. ఆంధ్రములో గాని ఆంగ్లములోగాని వీరు చదువని వ్యాకరణ గ్రంథములు గాని ఛందోలంకార గ్రంథములుగాని లేవు. అను శీలనము చేయని మహా కావ్యములు లేవు. పరామర్శింపని విమర్శ గ్రంథములులేవు. పైన బేర్కొనబడిన యీరెండు భాషలు వీరికి రెండు ఊపిరి తిత్తులు. మిల్టను, షేక్స్పియరు గ్రంథముల యందెంత నిశితమైన పాండిత్యము గలదో వసుమను చరిత్రాద్యాంధ్ర ప్రబంధముల యందును అంతటి సునిశితమైన పాండిత్యము సంపాదించిన మహామనీషి.

'కళాప్రపూర్ణ', 'ఆంధ్ర కాళిదాస' బిరుదాంచితులు, ప్రిన్స్ ఆఫ్ వేల్సు వారి పురస్కార బహుమాన పాత్రులునగు కీ.శే. త్రిపురాన వేంకట సూర్య ప్రసాదరావు దొరవారు స్వీయ పద్యకావ్యముల ప్రకటించుటకు పరిష్కర్తృత్వ సంపాదకత్వాది బాధ్యతలు వీరిపై మాత్రమేయుంచి పరమ సంతృప్తితో దివంగతులైరన్నచో వీరి నిర్దుష్టమైన ఆంధ్రభాషా పాండిత్య మెంతలో తైనదో చెప్పనక్కఱలేదు.

వీరిలో జిన్ననాటినుండి, యభివృద్ధి చెందిన భాషాభిమానముచే ఎంతటి వ్యయ ప్రయాసములను లక్ష్యపెట్టక, ఆనాటి గ్రాంథికవాద శిరోమణులగు జయంతి రామయ్యపంతులు, పానుగంటి లక్ష్మీనరసింహరావు పంతులు, వడ్డాది సుబ్బారాయకవి, కూచి నరసింహము పంతులు, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, చిలకమర్తి లక్ష్మీనరసింహము, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, వావిలి కొలను సుబ్బారావు పంతులు-మున్నగు వృద్ధ పండితాగ్రేసరులతో విమర్శక శిరోమణులతో అనేక సమావేశములు జరిపి తమ యభినివేశమునకు మిక్కిలి పదును పెట్టుకొని ప్రౌఢ గ్రాంథిక భాషాభిమానిగా నేటికిని ప్రసిద్ధిచెందియున్నారు. మరియు ఆనాడు సజీవులైయున్న గిడుగు రామమూర్తి పంతులుగారితో జంకు లేకుండ స్వయముగా ఢీకొని నిర్దుష్టముగా వ్యావహారిక భాషలో రచనచేయుట సాధ్యముకాదనియు, వ్యావహారిక ధోరణియను రచనలు చేయుచున్నామనుకొను వారిలో, వ్రేలు మడచినను ఒక్కడుగూడ లేడనియు వాదించి బహుళ ప్రమాణ ప్రమేయ ప్రభంజనముతో తద్వాదమును దూరీకరించిన మహోగ్రగ్రాంథికవాది రోశయ్యగారు. అంతేకాని, యింత వెల్లువగా వ్యాపించుచున్న నేటి వ్యావహారిక భాషా ప్రవాహమునకు వేతన వృత్తి నవలంబించినవారు కారు.

''ఇంతటియుభయ భాషా పాండిత్యము, వైవిధ్యవిశిష్ట విషయ పరిజ్ఞానము, ప్రతిభయున్నను మీరేల యెట్టి గ్రంథరచనకు బూనుకొనరు. ఇప్పటికైన నట్టి ప్రయత్నము చేయుట యుక్తము.'' అని

నేను రెండు మూడు పర్యాయములు వారిని ప్రశ్నించి, నిర్బంధించుట జరిగినది. వారు చెప్పు సమాధానము నాకిట్లు స్ఫురించుచున్నది. ''ఇప్పటికి గ్రాంధిక భాషలో రచింపబడిన గ్రంథజాలము అమూల్యమైనది వేలకొలదిగా లభ్యమగుచున్నది గదా. ఎన్నో విషయములపై అతివేలముగా దొరుకు గ్రంథములన్నియున్నను ఇంక నెన్నియేని వ్రాయవచ్చును. వ్యక్తిభేదముచేత, దేశభేదముచేత, గ్రంథములకు అనంతత్వము ప్రతిభా పాండిత్య వైభవమువలన సంపాదింపనగును. కాని నేటి విశ్వవిద్యాలయములేమి, కళాశాలలేమి, పాఠశాలలేమి, అందందు నియుక్తులైన పండితులు, తదితర నిరుద్యుక్త పండితులు-నందరును వ్యావహారిక భాషాకశ్మల ప్రవాహములో అంధ పరంపరగా కొట్టుకొని పోవుచున్ననేఁల నా వంటివారు రచించిన సలక్షణ గ్రంథముల మొగము చూచుట కెవ్వరుత్సహింతురు? ఎవ్వడేని ఒకడు నావంటివాడు లభించునేని వానినిగూడ చుట్టుముట్టి బుట్టలో వేసికొని మట్టు పెట్టుటకు ఈ వ్యావహారిక భాషావాదులు వెనుదీయరు. నేనెట్లును గ్రాంథిక భాషలో దప్ప గ్రంథరచన చేయనుగదా. మఱి దీనినెవరు పఠింతురు? పాఠకులను జూచుకొని కదా గ్రంథ ప్రకటనము?''

వీరికి ఆంధ్ర భాషయే కాక ఆంగ్ల రచనలు వ్యాకరణాది లక్షణారూఢములై శుద్ధ సుందరముగా నుండుట హర్షదాయకము కావ్యములే వ్రాయనక్కఱలేదు. నాటకములే రచింపనక్కరలేదు, నవలలే యుద్ధరింపనక్కఱలేదు. గ్రంథ రచన చేయకున్నను రోశయ్యగారు చిరకాలము కళాశాలాధ్యాపకాధ్యక్ష పదవుల నధిష్టించి యుపాధ్యాయ విద్యార్థి బృందముల డెందముల నలరించుచు క్రమశిక్షణకు లోటు రానీయక చక్కని ఆదర్శ జీవితముతో, ధర్మమున, నిరంతరాంధ్రాంగ్ల వాఙ్మయ వ్యాసంగ తపో నిష్ఠాగరిష్ఠులై జీవితమును గడిపినారు. వారి స్మృతి యస్మదాదులకే కాక గుణగ్రహణ దక్షులైన విద్యాభిరూపుల కెల్లరకు మిక్కిలి ముదావహమ్ము.